సాక్షి సంగారెడ్డి

శనివారం । 24 । ఆగస్టు । 2024



సాగు.. సగానికి తక్కువే

పప్పు దినుసుల సాగు గణనీయంగా తగ్గిపోతుంది. ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించినా సాగు విస్తీర్ణం పెరగడం లేదు.

వివరాలు 8లో ▸



పర్యాటక కొండ..

సంజీవరాయుడి గుట్ట పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ప్రకృతి అందాలకు నిలయంగా నిలుస్తోంది.

వివరాలు 8లో ▸



దోస్త్.. అడ్మిషన్‌లు అంతంతే

సాధారణ డిగ్రీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ. దీంతో విద్యార్థులు సాంకేతిక కోర్సుల వైపు అడుగేస్తున్నారు. వివరాలు 9లో ▸

స్థానిక పోరుకు కసరత్తు

ఓటరు జాబితాపై అధికారుల దృష్టి

- షెడ్యూల్ ఖరారు
- సెప్టెంబర్ 6న ముసాయిదా
- 6 నుంచి సవరణ
- జిల్లాలో గ్రామపంచాయతీలు 647
- జిల్లాలో వార్డులు 5,778

సంగారెడ్డిజోన్: గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాపై ప్రత్యేక షెడ్యూల్ ఖరారు చేసింది. వచ్చేనెల 6న వార్డుల వారీగా ముసాయిదా జాబితాను ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. జాబితాను ఏ విధంగా రూపు కల్పన చేయాలని అంశంపై అధికారులకు అవగాహన కల్పించినట్లు సమాచారం. గ్రామపంచాయతీలలోని వార్డులవారీగా జాబితాను తయారు చేయనున్నారు. అసెంబ్లీ ఓటరు జాబితా ఆధారంగా గ్రామపంచాయతీలు, వార్డులవారీగా కొత్త జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ముసాయిదా అప్పుడే..

సెప్టెంబర్ 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. వార్డుల వారీగా ఫొటోలతో కూడిన జాబితాను సిద్ధం చేసి పంచాయతీల వారీగా ప్రకటించనున్నారు. 9న జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, 10న మండల స్థాయిలో మండల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు నాయకులతో.. ఓటరు జాబితా పై సమావేశం ఏర్పాటు చేయనున్నారు. 13వ తేదీ వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. వీటిని 19 లోపు పరిష్కరించనున్నారు. 21న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్ధం చేసిన తుది ఓటరు జాబితాను వార్డులు పంచాయతీల వారీగా విడుదల చేయనున్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా మండల అధికారులకు ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

గ్రామాల్లో ప్రత్యేక పాలన

- జనవరిలో జిల్లాలోని సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ప్రత్యేక పాలనలో భాగంగా మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులను గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

జిల్లాలో 647 పంచాయతీలు

- జిల్లా వ్యాప్తంగా 25 మండలాలున్నాయి. అందులో 647 గ్రామ పంచాయతీలు ఉండగా, 5778 వార్డులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 13,93,711 మంది ఓటర్లు ఉన్నట్లు సమాచారం.



షెడ్యూల్ ప్రకారం జాబితా



ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబర్ 6న జిల్లాలోని పంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా జాబితా విడుదల చేస్తాం. ముఖ్యమైన తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించి 21న తుది జాబితా విడుదల చేస్తాం. జిల్లాలోని మండల స్థాయి అధికారులకు ఓటరు జాబితా ప్రక్రియ పై అవగాహన కల్పించాం.

– సాయిబాబా,
జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయీస్ నాయకులు

సీపీఎస్‌ను రద్దు చేయాలి

జీఓ 28 పత్రాలను దహనం చేసిన ఎంప్లాయిస్ సంఘం నేతలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వం సీపీఎస్ విధానంలో కొనసాగతామని చెబుతూ జీఓను విడుదల చేయడం దుర్మార్గమని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో సీపీఎస్ విధానంలో కొనసాగుతామని 23 ఆగస్టు 2014 ఇచ్చిన జీఓ 28 ప్రతులను దహనం చేశారు. నిరసనలో భాగంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇచ్చే భిక్షకాదని, ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని నినాదించారు. 30 సంవత్సరాలు ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ భాగస్వాములయ్యే ఉద్యోగుల పట్ల చిన్న చూపడం సరికాదన్నారు. విరమణ తరువాత వృద్ధాప్యంలో ఏ విధంగా కుటుంబాన్ని పోషించుకుంటారని ప్రశ్నించారు?, తక్షణమే ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, మున్నూరు అంజన్న, అసోసియేట్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అమత్, జిల్లా నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, నారాయణ, శివకుమార్, ఇమ్మానియల్ తదితరులు పాల్గొన్నారు.

శోచనీయం

పాత పెన్షన్ స్థానంలో 2004 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ వాపోయారు. శుక్రవారం సంగారెడ్డి, పటాన్‌చెరు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీపీఎస్ ను కొనసాగిస్తామని ప్రభుత్వం అంగీకరించడం శోచనీయమన్నారు. సీపీఎస్ స్థానంలో చాలా రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయన్నారు. దేశమంతటా దాన్నే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం దాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, పటాన్‌చెరు అధ్యక్షుడు రాములు, కంది అధ్యక్షుడు జనార్దన్, వట్ పల్లి అధ్యక్షుడు శ్రీనివాసాచారి, సోషల్ మీడియా కమిటీ సభ్యులు పుండరీకం, చంద్రశేఖర్, రాధ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆర్ఆర్ఆర్ స్థలాల పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని పలు గ్రామాల గుండా రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) వెళ్లే ప్రాంతాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. మండలంలోని దౌల్తాబాద్, సికింద్లాపూర్, దేవులపల్లి, కాసాల, గ్రామాల శివారు గుండా వెళ్లే రీజినల్ రింగ్ రోడ్డు ప్రాంత భూములను ఆర్అండ్‌బీ డీఈ రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్‌తో కూడిన బృందం పరిశీలించారు. భూ సేకరణ చేసిన వెంటనే రోడ్డు నిర్మాణం కోసం ఎంత వ్యయం అవుతుందోననే అంచనా నిమిత్తం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆ మేరకు నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. భూములు కోల్పోతున్న బాధితులకు సైతం అధికారులు ఇప్పటికే పలు దపాలుగా చర్చలు జరిపినట్లు చెప్పారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ : సాయికుమార్



చెరువును పరిశీలిస్తున్న రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని మహబూబ్ సాగర్ చెరువులో చేపల మృతితో నష్టపోయిన గంగపుత్రులను ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ హామీ ఇచ్చారు. చెరువులో మరణించిన చేపలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులో చేపలు మృతిచెందడంపై మత్స్యకారులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్, గంగ పుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ, మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్ నేతలు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



కరపత్రం చూపుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రైతులకు బేడీలు వేసి జైళ్లలో పెట్టించిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రుణమాఫీ కరపత్రం విడుదల చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ రూ.2 లక్షలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అహంకారంతో రాష్ట్రాన్ని రూ. ఐదు లక్షల కోట్ల అప్పులు పాలు చేశారని మండిపడ్డారు. ఆపార్టీ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారన్నారు. రైతు రుణమాఫీ పేరిట ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి మతిన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆతిక్, వడ్డే గోపాల్, రహమాన్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యకు ప్రాధాన్యం



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్టూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతా ప్రమాణాలతో అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాల్సిందే

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం తక్షణమే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడత 50,538 మంది రైతులకు రూ. 277 కోట్లు మాఫీ చేయగా, రెండవ విడత 27,233 మందికి రూ.286 కోట్లు, 3వ విడత 20,102 మంది రైతులకు రూ.280 కోట్లు మాఫీ జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 97,873 మందికి రూ.846.31 కోట్లను మాఫీ అయ్యిందన్నారు. ఇంకా మాఫీ కాకపోవడంతో ఎంతో మంది రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. తెల్లరేషన్ కార్డు లేక, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు పాస్‌బుక్‌లో తప్పుల వల్ల అనేక మందికి మాఫీ కాలేదన్నారు. టెక్నికల్ సమస్య వల్ల కూడా మాఫీ కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన వారందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి అందించిన వారిలో రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో బ్యూటీ పార్లర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు సెప్టెంబర్ 6 వరకు గ్రామీణ ప్రాంత మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాలకు మహిళలు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 9 నుంచి బ్యూటీ పార్లర్, సెప్టెంబర్ 10 నుంచి టైలరింగ్ ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 94901–03390 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తప్పిన ఆధార్ అప్‌డేట్ తిప్పలు

హవేళిఘణాపూర్(మెదక్): పిల్లల ఆధార్ అప్‌డేట్ చేసేందుకు తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్వశిక్షా అభియాన్ ద్వారా జిల్లాలోని 13 మండల కేంద్రాల్లో ఎస్ఎస్ఆర్ ఏజెన్సీ ద్వారా సేవలందిస్తోంది. ఈ ఏజెన్సీ సిబ్బంది ఆధార్ కిట్‌తో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులకు డబ్బుతో పాటు ఇబ్బందులు కూడా తప్పాయి. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని ఎస్ఎస్ఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ కుమార్ తెలిపారు. ఆధార్ సేవా కేంద్రం ఆపరేటర్ మండలంలోని ఆయా పాఠశాలలకు రెండు, మూడు రోజుల సమయం కేటాయించి సేవలందిస్తున్నారు.

పకడ్బందీగా డ్రై డే ఫ్రైడే

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా 'డ్రై డే ఫ్రైడే'ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దాపూర్‌లో ఎంపీఓ సంతోష్ కుమార్‌తో కలిసి ఆయన పర్యటించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించి, నిల్వ ఉన్న వర్షపు నీరును తొలగింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వర్షా కాలం నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతీఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రహదారులు, ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిలవకుండా వెంటనే తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో కూలర్లు, నీటి తొట్టెలు, టైర్స్ వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు అంటు వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రమ్ములో నిల్వ ఉన్న నీరును పారబోయిస్తున్న డీపీఓ సాయిబాబా

ప్రజా ప్రయోజనాలకే ఆర్ఓఆర్ చట్టం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- వివిధ వర్గాల ప్రజలతో చర్చా వేదిక

మెదక్ కలెక్టరేట్: ప్రజలు, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ఆర్ఓఆర్ చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీలో ఆర్ఓఆర్ ముసాయిదా చట్టం 2024 అమలుపై చర్చావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన హక్కుల రికార్డు బిల్లు 2024 రూపకల్పన సందర్భంగా న్యాయవాదులు, రైతులు, రైతు సంఘాలు, రిటైర్డ్ అధికారులు, సిబ్బంది, మేధావులు ఇలా అన్నివర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చట్టం రూపకల్పనలో క్షేత్రస్థాయిలో ప్రజల సూచనలు, సలహాలను తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. ఆర్ఓఆర్ చట్టం రూపకల్పనలో భాగంగా ప్రభుత్వ అభ్యంతరాల కోసం ప్రభుత్వం వెబ్‌సైట్ కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతులకు స్వేచ్ఛగా సక్రమంగా హక్కులను కల్పించే చర్యల్లో ఇలాంటి చర్చా వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీఓలు రమాదేవి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, న్యాయవాదులు, రిటైర్డ్ ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్

• 120 ఇళ్లు తనిఖీ • నంబర్ ప్లేట్ లేని 17 వాహనాలు సీజ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ ఏసీపీ నరసింహారావు ఆధ్వర్యంలో 120 ఇళ్లలో తనిఖీలు చేశారు. నంబర్ ప్లేట్‌లు లేని 17 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు సీజ్ చేశారు. దుకాణంలో విక్రయిస్తున్న అక్రమ గుట్కాలను, మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మియాపూర్ ఏసీపీ నరసింహారావు మాట్లాడుతూ, సైబరాబాద్ సీపీ, మాదాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, చందనగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, ఎస్ఐ శశికాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ నరసింహారావు

వైరల్.. ఫీవర్ !

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలో వైరల్ ఫీవర్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అందరూ ఆస్పత్రి పాలవుతున్నారు. దీంతో ఇవి కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రం సంగారెడ్డి జనరల్ ఆస్పత్రి, నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్, పటాన్‌చెరువు ఏరియా ఆస్పత్రులు, కల్హేర్ సీహెచ్‌సీ, ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ రోజుల కంటే ఇటీవల అవుట్ పేషంట్లు(ఓపీ) పెరిగారు. వీరిలో జ్వరపీడితులు అధికంగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ఇదే పరిస్థితి. రోగులతో కిటకిటలాడుతున్నాయి. డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులతో సతమతమవుతున్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు..

నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, చెత్తాచెదారం నిల్వ ఉండే చోట్ల శుభ్రం చేయాలి. కొబ్బరిబోండాలు, పూలకుండీల్లో నిల్వ ఉండే నీరు కూడా దోమలు వృద్ధికి కారణం. ఆ నీరు ఎప్పటికప్పుడు బయటకి పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కుండీకి చిన్న కన్నం చేస్తే నీరు బయటకు పోతుంది. సెప్టిక్ ట్యాంకుల గొట్టాలకు జల్లెడలు బిగించాలి. అందులో కొంచెం కిరోసిన్ పోయాలి. పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బోండాలు, వాడి విసిరేసిన ప్లాస్టిక్ టీ కప్పులను దూరంగా తరలించాలి. లేదా తగులబెట్టాలి. కాగా, ఖాళీ స్థలాల చుట్టూ రోడ్లు ఏర్పడటంతో లోతట్టు ప్రాంతాలుగా మారి వర్షపు నీటితో నిండిపోతున్నాయి. దోమలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. వాటిని పూడ్చించాలి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- పెరుగుతున్న ఓపీలు
- రోగులతో ఆస్పత్రులు కిటకిట
- దోమలు వ్యాప్తి, పరిసరాల అపరిశుభ్రతే కారణం



నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులు

నెల	జ్వరం బాధితుల సంఖ్య
జూన్	632
జులై	540
ఆగస్టు	303

కలుషిత నీటితో వ్యాధులు

వర్షాకాలంలో తాగు నీరు కలుషితమవడానికి ఆస్కారం ఎక్కువ. ఇవి నేరుగా తాగడం వల్ల కలరా, డయేరియా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. డయేరియా వస్తే వాంతులు, విరేచనాలవుతాయి. కడుపు నొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, చర్మం ముడతలు పడటం జరుగుతోంది. మూత్ర విసర్జన తగ్గిపోతోంది. విరేచనాలు నీళ్లలా విసర్జన అవుతుంటే కలరాగా అనుమానించాలి. ఇది సోకితే రోగి త్వరగా నీరసించి కదల్లేని స్థితికి చేరుకుంటాడు. వెంటనే గుర్తించి చికిత్స అందించాలి. కుటుంబ సభ్యులు మరింత జాగ్రత్తగా ఉండాలి. 1 జనవరి 24 నుంచి ఆగస్టు–24 వరకు జిల్లాలో 160 డెంగీ కేసులు నమోదయ్యాయి.

జ్వరంతో బాధపడుతున్నా..

తీవ్ర జ్వరంతో వారం రోజుల నుంచి బాధపడుతున్నా. ప్రైవేట్ డాక్టర్ల వద్ద ప్రాథమిక చికిత్స చేయించుకున్నా. జ్వరం తగ్గలేదు. మూడు రోజుల క్రితం ఏరియా ఆస్పత్రికి వచ్చి చేరాను. ఇంకా పూర్తిగా తగ్గలేదు. చాలామంది వైరల్ ఫీవర్ బాధితులు ఉన్నారు. ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నారు.

– అంబదాస్, అనంతసాగర్,
నారాయణఖేడ్ మండలం

జ్వర సర్వే చేస్తున్నాం

జిల్లాలో జ్వరం సర్వే జరుగుతోంది. వైరల్ ఫీవర్ అరికట్టేందుకు వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలను అప్రమత్తం చేశాం. ఇంటింటా తిరిగి జ్వరం బాధితుల సమాచారం సేకరిస్తున్నాం. బాధితులను తక్షణమే చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలి.

– గాయత్రీదేవి, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

నంబర్ వన్ స్థానంలో నిలువడం అభినందనీయం


మొక్క నాటుతున్న వినోద్‌కుమార్

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ బస్ డిపోను రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలుపడం హర్షణీయమని హైదరాబాద్, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం బస్సు డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రికార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సు డిపో సిబ్బంది రాఖీ పండుగ అంకితభావంతో పని చేసి రాష్ట్రంలో అత్యుత్తమమైన ఆదాయం తెచ్చినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కండక్టర్, డ్రైవర్ శ్రమను కొనియాడారు. అలాగే ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడిపేలా తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పావన్, బాబునాయక్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

– ముగిసిన జిల్లా స్థాయి పోటీలు


యోగా చేస్తున్న విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో శుక్రవారం జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించగా అనిల్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో ఆరు విభాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి 183 మంది క్రీడాకారులు పాల్గొనగా 72 మందిని విజేతలుగా ఎంపిక చేసినట్లు కోచ్ కరణం గణేశ్ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శారద, మంజులత, నరేశ్, సత్యనారాయణ, శ్యాం, రెఫరీలుగా మల్కీలశ్వరీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయండి

– కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న గ్రామస్తులు

మెదక్ కలెక్టరేట్: తమ కోమటిపల్లి, కోమటిపల్లి తండా, వడ్డెర కాలనీని కలిపి పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోమటిపల్లి, కోమటిపల్లితండా, వడ్డెర కాలనీలు రామాయంపేట మున్సిపాలిటీలో ఉండటంతో ఉపాధి పనులు కరువయ్యాయని తెలిపారు. ఉపాధి పనులు లేక వలస కూలీలుగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. మున్సిపాలిటీ కారణంగా అధిక పన్నులు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నుంచి సరైన నిధులు రాక అభివృద్ధికి నోచుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని భూంపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై హరీశ్ కథనం మేరకు.. స్థానిక భూంపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుంగా ఓ బొలేరో వాహనంలో 60 సంచుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గుర్తించాం. దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన పర్వతం యాదగిరిపై కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని ఎమ్మెల్సీ పాయింట్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాగు.. సగానికి తక్కువే

తగ్గిన పప్పుదినుసుల విస్తీర్ణం

- ప్రతీయేటా పడిపోతున్న వైనం
- జిల్లాలో 'పల్స్'పై తీవ్ర ప్రభావం
- మద్దతు ధర లభించినా ఆసక్తి చూపని రైతులు

మనిషికి అవసరమైన అత్యంత విలువైన పోషకాలను అందించే పప్పు దినుసుల సాగు జిల్లాలో గణనీయంగా తగ్గిపోతుంది. మార్కెట్‌లో పప్పులకు మంచి ధర ఉన్నా, ప్రభుత్వం నుంచి మద్దతు ధర లభించినా సాగు విస్తీర్ణం మాత్రం పెరగడం లేదు. ప్రభుత్వం పప్పు దినుసుల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులను తరచూ ఆదేశిస్తుంది. అధికారులు కూడా సభలు, సమావేశాల్లో సూచిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలో వర్షాభావం కారణంగా పప్పుదినుసుల సాగుపై ప్రభావం పడిందని అధికారులు చెబుతున్నారు.

– నారాయణఖేడ్


ఓ రైతు సాగు చేసిన కంది


నారాయణఖేడ్‌లో సాగు చేసిన పెసర పంట

జిల్లా వ్యాప్తంగా పప్పుదినుసుల సాగు విస్తీర్ణం భారీగా తగ్గుతుంది. ముఖ్యంగా నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో పుప్పుదినుసుల సాగు అధికంగా ఉంటుంది. స్వల్పకాలిక రకంగా ఉన్న పెసర పంట విస్తీర్ణం భారీగా తగ్గింది. పెసరను జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 41,832 ఎకరాల్లో రైతులు సాగు చేయాల్సి ఉండగా కేవలం 11,813 ఎకరాల్లోనే సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గింది. మార్కెట్లో పెసర పంటకు మంచి ధర ఉంది. పెసర పంట స్వల్పకాలిక రకం కాగా మూడు నెలల్లోపే పంట రైతు చేతికి వస్తుంది. ఈ పంటలో అంతర పంటగా ఇతర పంటను సాగు చేసి రైతులు ఒకే యేడులో రెండు రకాల పంటలను తీసుకొనే అవకాశం ఉంది. కానీ ఈ పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. మినుము 21,877 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంగా 7,473 ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ పంట కూడా మూడో వంతు మాత్రమే సాగు చేశారు. కంది పంట 70,831ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాధారణ స్థాయిలోనే సాగు అయ్యింది. అధిక మొత్తంలో సాగు చేయాల్సిన అవసరం ఉంది.

పెరుగుతున్న పత్తి

పత్తి పంట జిల్లాలో 2.85 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఈ పంటను 3,32,698 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పత్తి విస్తీర్ణం ప్రతీసారి పెరుగుతూనే వస్తుంది. రెండేళ్లుగా మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. కానీ రైతులు ధరలు అధికంగా ఉంటాయన్న ఆశతో పత్తి పంట సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. కానీ మార్కెట్‌లో పప్పులకు మంచి ధర పలుకుతుంది. ప్రభుత్వ మద్దతు ధరకు మించి పప్పుల ధరలు మార్కెట్‌లో ఉంటున్నాయి.

వర్షాభావంతో ప్రభావం

జిల్లాలో ఈయేడు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ మండలాల్లో పప్పుదినుసుల సాగు అధికంగా ఉండగా ఈ నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో రెండు నెలల్లో లోటు వర్షపాతం నమోదు కావడం పంట సాగుపై తీవ్ర ప్రభావం పడింది. జూన్ నెలలో 120 మి.మీ వర్షపాతం జిల్లాలో కురవాల్సి ఉండగా 139 మి.మీ కురిసింది. జూలైలో 194కు గాను 188 మిల్లీ మీటర్లు కురిసింది. ఆగస్టు నెలలో కూడా ఇప్పటివరకు లోటు వర్షపాతమే నమోదు అయ్యింది. జూన్ నెలలో వర్షాకాలం ప్రారంభంలో భారీ వర్షాలు కురిసి సాధారణం కంటే రెట్టింపు వర్షపాతం నమోదు కావాలి. కానీ అందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. తక్కువ వర్షపాతం వల్ల పంటల సాగుపై ప్రభావం పడింది.

> **2 ఎకరాల్లోనే సాగు**
>
> 
>
> పెసర ఒక ఎకరం, కంది ఎకరంలో సాగు చేశాను. ప్రతీసారి నాలుగు ఎకరాల్లో పెసర మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేసేవాడిని. ఈసారి వర్షాభావం కారణంగా రెండు ఎకరాల్లోనే ఈ పంట సాగు చేపట్టాను. పత్తి పంట నాలుగు ఎకరాల్లో వేశా. వర్షాలు సరిగా లేవు.
>
> – బిరాదర్ ప్రవీణ్, రైతు, జగన్నాథ్ పూర్
>
> **దెబ్బతిన్న పెసర..**
>
> 
>
> సరియైన వర్షాలు లేని కారణంగా పెసర పంట దెబ్బతింది. రెండు ఎకరాల్లో పెసర పంట, మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. పెసరకు భారీగా నష్టం వాటిల్లింది. దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈయేడు సరైన వర్షాలు కురియలేదు.
>
> – పటేల్ రమేశ్, రైతు, జగన్నాథ్ పూర్

అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నగేశ్ మృతదేహం

సిద్దిపేటఅర్బన్: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండి నగేశ్ (24) బంధువుల పెళ్లి బరాత్ నిమిత్తం తొగుట మండలం గుడికందుల గ్రామానికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సిద్దిపేటకు తిరిగి వస్తున్నాడు. ఎన్సాన్‌పల్లి శివారు సర్వాయి పాపన్న చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తూ..

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొల్గురూ గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ సైదా కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా నిజాంపేట మండలం తిప్పనగండ్ల గ్రామానికి చెందిన షేరుపల్లి స్వామి(40) కొన్నేళ్లుగా ప్రజ్ఞాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం అత్తగారి గ్రామమైన మిరుదొడ్డి మండలం కాసులాబాద్‌కు వెళ్తుండగా కొల్గురూ గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో రాత్రంతా అక్కడే పడి ఉన్నాడు. శుక్రవారం కొల్గురూ గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్తూ చూసి గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ముందుకు తీస్తూ కారు బీభత్సం

దంపతులను ఢీకొట్టడంతో గాయాలు

అనంతరం డివైడర్ పైకెక్కిన వాహనం


డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

సిద్దిపేటకమాన్: కారు డివైడర్ పైకి దూసుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రం సిద్దిపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఓ కారు డ్రైవర్ వాహనాన్ని ముందుకు తీస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి అటుగా వెళ్తున్న మరో బుల్లెట్ బైక్ పైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా కారు ముందుకు దూసుకెళ్లడంతో ద్విచక్ర వాహనం కారు కింద పూర్తిగా ఇరుక్కుపోయింది. అనంతరం రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డివైడర్ పై నిలిచిపోయిన కారును పక్కకు తొలగించారు.

ఆరు నెలల తర్వాత తల్లిదండ్రుల చెంతకు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

తూప్రాన్: మతి స్థిమితం లేక దారి తప్పిన మానసిక దివ్యాంగుడు ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన మెరుగు గాడ్సన్ జాషువా మొదటి కుమారుడు బ్లెస్సెన్ రాజు (20) మతిస్థిమితం లేని మానసిక దివ్యాంగుడు. 2024 జనవరిలో హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పెద్దనాన్న సెల్వ రాజు వద్దకు వచ్చాడు. అదే నెల చివరి వారంలో తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 2వ తేదీన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో పోలీసులకు దొరికాడు. వారు శివ్వంపేట మండలంలోని బేతాని ఆశ్రమంలో అప్పగించగా అక్కడే ఉంటున్నాడు. జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్, మెదక్ పోలీసులు 'దర్పనేప'లో వివరాలు నమోదు చేశామన్నారు. అందులో భాగంగా తల్లిదండ్రులను గుర్తించి వారికి సమాచారం అందించామని ఎస్‌ఐ తెలిపారు. ఆరు నెలల తర్వాత కుమారుడు దొరకడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం

- నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వారా మొదటి కేసు
- ములుగు పీఎస్ పరిధిలో ఇద్దరు అనుమానితులకు పరీక్షలు
- గంజాయి తీసుకున్నట్లు రిపోర్టులో నిర్ధారణ


అనుమానితులను పరీక్షిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కుమార్

సిద్దిపేటకమాన్/ములుగు: జిల్లాకు నూతనంగా వచ్చిన నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వారా పోలీసు సిబ్బంది ఇద్దరు అనుమానిత వ్యక్తులను పరీక్షించగా అందులో ఓ వ్యక్తి గంజాయి తీసుకున్నట్లు రిపోర్టులో తేలింది. మిషన్ ద్వారా సిద్దిపేట జిల్లాలో మొదటి కేసు నమోదైనట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడమే మన ప్రధాన లక్ష్యమని, మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత అని అన్నారు. ములుగు మండల కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని పౌల్ట్రీ ఫామ్ వద్ద గురువారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి మద్యం దొరకలేదన్నారు. ఘటనా స్థలంలో ఉన్న ములుగుకు చెందిన గంగబోయి స్వామి, యూ.సురేశ్ ప్రవర్తనలో అనుమానం రావడంతో పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌తో టెస్ట్ చేయగా గంజాయి సేవించినట్లు రిపోర్టు వచ్చింది. పోలీసులు


నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్

ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్లను జిల్లా వ్యాప్తంగా 100 కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేటప్పుడు తప్పకుండా వీటిని ఉపయోగించాలన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువత గంజాయి, దురలవాట్లకు అలవాటు పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సీపీ హెచ్చరించారు.

గజ్వేల్‌రూరల్: నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌తో శుక్రవారం రాత్రి గజ్వేల్ పట్టణంలో తనిఖీలు చేపట్టినట్లు సీఐ సైదా తెలిపారు. అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్ ద్వార పరీక్షిస్తామన్నారు.

అధిక ఆదాయాన్నిచ్చే పంటలు వేయాలి


రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

- కేవీకే హెడ్, శాస్త్రవేత్త శంబాజి దత్తా త్రేయనల్కర్
- రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువుల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): సంప్రదాయ పంటలకు భిన్నంగా అధిక ఆదాయాన్నిచ్చే పంటలను రైతులు సాగు చేయాలని కేవీకే హెడ్, శాస్త్రవేత్త శంబాజి దత్తాత్రేయ నల్కర్ సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి చేయాలన్నారు. వరికి బదులుగా పండ్ల తోటల్లో బొప్పాయి, మిర్చి, ఉల్లి, ఆకుకూరల పంటలు సాగు చేయడంతో అధిక ఆదాయం వస్తుందన్నారు. బొప్పాయి సాగులో మంచి లాభాలు ఉంటాయని అన్నారు. కూరగాయలతో ప్రతి రోజూ ఆదాయం వస్తుందన్నారు. రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేయాలన్నారు. ప్రతి రోజూ పంటను పరిశీలించాలని చీడపీడలు ఆశిస్తే నివారణకు నీమ్ ఆయిల్, కషాయాలు స్ప్రే చేయాలన్నారు. ఈ సందర్భంగా 41 మంది ఎస్సీ రైతులకు నీమ్ ఆయిల్, జీవన ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త, షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

బీవీఆర్ ఐటీ కంప్యూటర్ విజ్ఞాన విభాగాధిపతి మధుబాబు


మద్దూర్ పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న కళాశాల సిబ్బంది

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని బీవీఆర్ ఐటీ విభాగాధిపతి సీహెచ్.మధుబాబు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కళాశాల కంప్యూటర్ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో మండలంలోని కాగజ్ మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం కంప్యూటర్లను అందజేశారు. కార్యక్రమంలో మధుబాబు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు బీవీఆర్ ఐటీ యజమాన్యం కృషి చేస్తుందన్నారు. కృత్రిమ మేధ, యంత్ర విద్య మొదలైన అంశాల్లో సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్యాకేజీతో క్యాంపస్ ప్లేస్ మెంట్ అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డా.ఆర్ సూర్యప్రకాశ్ రావు, యూసుఫ్, షరీఫ్, మహేందర్ రెడ్డి, సత్యనారాయణాచారి, కవిత, అప్పల నాయుడు, సురేశ్ కుమార్, సుందరయ్య, బస్వరాజు, నర్సింలు పాల్గొన్నారు.

పర్యాటక కొండ.. సంజీవరాయుడి గుట్ట

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రాంతం
- చాళుక్యులు నిర్మించిన ఖిల్లా, సొరంగ మార్గం, నీటి కొలను
- శ్రావణ మాసంలో పిక్నిక్ స్పాట్‌గా..
- వర్షాలు కురువాలని వరద పాయసంతో సందడి


వరద పాయసం కోసం ఎగబడుతున్న జనం

హుస్నాబాద్: శ్రావణ మాసం వచ్చిందంటే ఆహ్లాదకరమైన వాతావరణంలో వన భోజనాలు, పిక్నిక్ వెళ్లి సందడి చేస్తారు. ప్రకృతి సౌందర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ప్రదేశాలను ఆస్వాదిస్తారు. అలాంటి ప్రకృతి, రమణీయంతో స్వాగతిస్తున్న సంజీవరాయుడి గుట్ట పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలోని సంజీవరాయుడి గుట్ట ప్రకృతి అందాలకు నిలయమైంది.

నాలుగు వారాలు కిటకిట

సంజీవరాయుడి గుట్ట దాదాపు 100 ఎకరాలకు పైగానే ఉంటుంది. గుట్ట పైకి నడిచి వెళ్లాలంటే తిరుపతి కొండలను ఎక్కినట్లుగా అనుభూతి పొందుతారు. గుట్ట చుట్టూ ప్రకృతి రమణీయమైన ఆకుపచ్చని పంట పొలాలు కనిపిస్తాయి. ఒక్కసారి వీక్షిస్తే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది. గుట్టపై చాళుక్య రాజులు నిర్మించిన ఖిల్లా, నీటి కొలను, సొరంగ మార్గం, రేగొండ దర్వాజ, హనుమాన్ దేవాలయంతో పాటుగా కట్టడాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి.


గుట్ట కింది భాగంలో ప్రకృతి అందాలు

సంజీవరాయుడి గుట్ట, పెద్దగుట్ట మధ్య కల్కి చెరువు దృశ్యం మైమరిపిస్తుంది. గుట్ట కింది భాగంలో సమ్మక్క సారలమ్మ గద్దెలు నిర్మించారు. మూడేళ్లకోసారి వచ్చే సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించారు. శ్రావణ మాసంలో నాలుగు వారాలు పర్యాటకులతో కిటకిట లాడుతుంది.

గుట్టపై వరద పాయసం

శ్రావణ మాసంలో ఇక్కడ జనమంతా వన భోజనాలకు వచ్చి సేద తీరుతారు. గుట్టపైనే వంటలు వండుకుంటారు. డప్పు చప్పుళ్లతో గుట్ట పైకి ఊరేగింపుగా వెళ్తారు. కొలనులో స్నానాలు ఆచరిస్తారు. అనంతరం హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేస్తారు. అనంతరం గుట్టపై బెల్లం పానకంతో తయారు చేసిన పాయసం వండుతారు. వర్షాలు కురువాలని బండ రాయిపై పోసిన వరద పాయసాన్ని స్వీకరించేందుకు జనం ఎగబడుతారు. వరుణ దేవున్ని కొలుస్తూ మహిళలు బతుకమ్మ ఆటలు ఆడుతూ రోజంతా గడుపుతారు. గుట్టపై ఉన్న కట్టడాలపై కూర్చొని ప్రకృతి అందాలను కనులారా వీక్షించి సంతోషం పొందుతారు.


నీటి కొలనులో స్నానం చేస్తున్న జనం


సొరంగం నుంచి బయటకు వస్తున్న మహిళ

పచ్చని పొలాల్లోకి కెమికల్ వ్యర్థాలు


కుంటను తలపిస్తున్న వ్యర్థాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఇష్టారాజ్యంగా కెమికల్ వ్యర్థాలను పరిశ్రమ నిర్వాహకులు బయటకు వదిలేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి బిజ్లిపూర్‌లోని ఓ కెమికల్ పరిశ్రమ నిర్వాహకులు వర్షాలను ఆసరాగా తీసుకొని అదే నీటిలో వ్యర్థాలను బయటకు వదిలేస్తున్నారు. ఆ వ్యర్థాలు పచ్చని పంట పొలాల్లోకి చేరుతుండడంతోపాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. నిబంధనల ప్రకారం పరిశ్రమల్లోని కెమికల్ వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి వ్యర్థాల కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. సంబంధిత పీసీబీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కెమికల్ పరిశ్రమ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయం గురించి పీసీబీ ఈఈ కుమార్ పాటీ వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.